సయ్యద్ జమీలుద్దీన్‌కు పీహెచ్‌డీ



రాయదుర్గం: మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలో పరిశోధక విద్యార్థి సయ్యద్ జమీలుద్దీన్‌కు పీహెచ్‌డీ డిగ్రీని ప్రకటించారు. అరబిక్ విభాగంలోని అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ తల్హా ఫర్హాన్ పర్యవేక్షణలో 'అల్లామా ఫజిల్ హక్ ఖైరాబాది కవిత్వంలో వాక్చాతుర్య లక్షణాలు.. ఒక విశ్లేషణాత్మక, విమర్శనాత్మక అధ్యయనం' అనే అంశంపై పీహెచ్‌డీ థీసిస్‌ను సమర్పించారు.

ఘనంగా కన్యకాపరమేశ్వరి జయంతి



పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే గాంధీ

చందానగర్: చందానగర్ డివిజన్ పరిధి రెడ్డికాలనీలోని సీతారామంజనేయ దేవాలయంలో ఆర్యవైశ్య మహాసభ, ఐవీఎఫ్, ఐక్యవేదిక, ఆర్య వైశ్య సంఘం చందానగర్ ఆధ్వర్యంలో శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి జయంతి వేడుకలు వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్, నాయకులు రఘునాథ్‌రెడ్డి, సభ్యులు పబ్బ మల్లేష్, పసుమర్తి శ్రీనివాస్ గుప్త, దారా లక్ష్మణ్ గుప్త, జయకృష్ణ పాల్గొన్నారు.

రోడ్డుపై పడి వ్యక్తి మృతి



మన్యంకొండ (ఫైల్)

మియాపూర్: రోడ్డు పక్కన కిందపడి ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం... మన్యంకొండ(38), భార్య అంజలి, ఓ కుమారుడితో కలిసి మియాపూర్ మయూరినగర్ కాలనీలోని శ్రీలా గార్డెన్‌లో వాచ్‌మెన్‌గా పనిచేస్తూ అక్కడే ఓ రూమ్‌లో నివాసముంటున్నారు. మంగళవారం రాత్రి మద్యం తాగి ఇంటికి వెళ్లలేదు. బుధవారం ఉదయం 5 గంటల సమయంలో మియాపూర్ బొల్లారం క్రాస్ రోడ్డు సమీపంలోని ఓ హోటల్ ముందు రోడ్డు పక్కన మన్యంకొండ స్పృహ కోల్పోయి పడి ఉన్నాడని కుటుంబ సభ్యులకు స్థానికులు తెలిపారు. ఘటనా స్థలానికి చేరుకుని మన్యంకొండ గాంధీ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు.

సమస్యలను పరిష్కరించండి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని కొల్లూరు ప్రభుత్వ డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను బుధవారం సీపీఎం నాయకులు సందర్శించారు. అక్కడి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి జయరాజ్ మాట్లాడుతూ.. ఇక్కడ నివాసం ఉంటున్న నిరుపేదలు అనేక ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. తాగునీరు సరిగా రావడం లేదని తెలిపారు. నిర్మాణం సరిగా లేక ప్రతి నెల చందాలు వేసుకోవాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. పేదల సమస్యలపై పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో నాయకులు వాజిద్ అలీ, నర్సింహులు, నాగేశ్వరావు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

గణితంలో పీహెచ్‌డీ

పటాన్‌చెరు: మండల పరిధిలోని రుద్రారం గీతం స్కూల్ ఆఫ్ సైన్స్, గణిత శాస్త్ర విభాగం పరిశోధక విద్యార్థిని సీహెచ్. మంగమ్మ డాక్టరేట్‌కు అర్హత సాధించారు. ×నిలువు పోరస్ ప్లేట్ అంతటా మాగ్నెటో హైడ్రోడైనమిక్ ద్రవ ప్రవాహం యొక్క వేడి, ద్రవ్యరాశి బదిలీ ప్రభావం₹ అనే అంశంపై ఆమె సిద్ధాంత వ్యాసాన్ని సమర్పించారు. ఈ పరిశోధనకు మార్గదర్శనం వహిస్తున్న గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ గణిత శాస్త్ర విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ బాల సిద్దులు మల్గ బుధవారం ఈ విషయాన్ని వెల్లడించారు.

వైభవంగా బ్రహ్మోత్సవాలు



రామచంద్రాపురం(పటాన్‌చెరు): బీహెచ్ఈఎల్ టౌన్‌షిప్‌లోని వెంకటేశ్వర స్వామి ఆలయంలో బుధవారం బ్రహ్మోత్సవాల సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. మహాలక్ష్మీ, గోదాదేవి అమ్మవారికి పసుపు, కుంకుమలతో ప్రత్యేక కుంకుమార్చన నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రధాన అర్చకులు కృష్ణమాచార్యులు మాట్లాడుతూ గురువారం బ్రహ్మోత్సవాలు ముగింపు కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ఆక్రమణలను అడ్డుకోండి

పటాన్‌చెరు టౌన్: డివిజన్ పరిధిలోని సీతారామపురం కాలనీలో పబ్లిక్ రోడ్డును ప్లాట్లుగా మార్చేందుకు ప్రయత్నిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు నాగరాజు యాదవ్ కోరారు. ఈ ఈ మేరకు బుధవారం జీహెచ్ఎంసీ డిప్యూటీ కమిషనర్ సురేష్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు.

అల్లుకున్న ప్రమాదం.. అధికారులు మౌనం!





ఇందిరానగర్ శ్మశానవాటిక వద్ద ఇలా..



కంచలేని ట్రాన్స్‌ఫార్మర్ వద్ద పెరిగిన పిచ్చి మొక్కలు

చందానగర్: చందానగర్ డివిజన్ పరిధిలోని ఇందిరానగర్ శ్మశాన వాటి సమీపంలో ఉన్న విద్యుత్ స్తంభాలతో పాటు తీగలకు పిచ్చిమొక్కలు అల్లుకుపోయి ప్రమాదకరంగా మారాయి. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో అని అటుగా వెళ్లే వాహనదారులు భయభ్రాంతులకు గురవతున్నారు. విద్యుత్ శాఖ అధికారులు చెట్ల కొమ్మలు తీగలకు అడ్డువస్తున్నాయని తొలగిస్తున్నారు కానీ.. స్తంభాలకు అల్లుకుని ప్రమాదకరంగా మారిన వాటిపై దృష్టి పెట్టడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యలపై పలుమార్లు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకుండా పోతుందని వాపోతున్నారు. తారానగర్ పోచమ్మ దేవాలయం నుంచి చందానగర్ పీజేఆర్ స్టేడియం వైపు వెళ్లే దారిలో విద్యుత్ తీగలు చాలా ప్రమాదకరంగా చెట్ల మధ్యల నుంచి వెళ్తున్నాయి. ఉన్నతాధికారులు స్పందించి విద్యుత్ స్తంభాలు, తీగలకు అల్లుకున్న పిచ్చి మొక్కలను తొలగించాలని కోరుతున్నారు.



చందానగర్ పీజేఆర్ స్టేడియానికి వెళ్లే దారిలో ఉన్న స్తంభాలకు అల్లుకున్న తీగలు

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అడ్మిషన్లు ప్రారంభం

మూసాపేట: కూకట్‌పల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అడ్మిషన్లు ప్రారంభమయ్యాయని ప్రిన్సిపాల్ వెంకటయ్య తెలిపారు. ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, ఎంఈసీ గ్రూపులతో పాటు ఒకేషనల్ కోర్సుల్లో సీజీఏ, ఏఅండ్‌టీ, పీఎస్‌టీ గ్రూపులలో అడ్మిషన్లు జరుగుతున్నాయన్నారు. బుధవారం విద్యార్థులు అధిక సంఖ్యలో అడ్మిషన్ కోసం వచ్చారని ఆయన తెలిపారు.

సమ్మెను జయప్రదం చేయాలి

జిన్నారం(పటాన్‌చెరు): ఈనెల 20 తేదీన జరగనున్న సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యులు రాజయ్య పిలుపునిచ్చారు. ఈ మేరకు బొల్లారం పారిశ్రామికవాడలోని పలు పరిశ్రమలకు నోటీసులు అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తక్షణమే లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని, కార్మికుల సమస్యలు, ధరలు తగ్గించి ప్రభుత్వరంగ సంస్థలను కాపాడాలన్నారు. పరిశ్రమలన్నీ స్వచ్ఛందంగా సెలవు ప్రకటించాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు సురేందర్‌రెడ్డి, అర్జున్ పాల్గొన్నారు.

హెచ్‌సీయూలో బంగ్లాదేశ్ డిప్యూటీ కమిషనర్ పర్యటన



హెచ్‌సీయూ ప్రొఫెసర్లతో షెల్లీసలేహిన్

రాయదుర్గం: బంగ్లాదేశ్ డిప్యూటీ హై కమిషన్ ఉన్నత స్థాయి బృందం గచ్చిబౌలిలోని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో పర్యటించారు. చెన్నయ్‌లోని బంగ్లాదేశ్ డిప్యూటీ హై కమిషనర్ షెల్లీ సలేహిన్ నాయకత్వంలో సామాజిక కార్యదర్శి ఎస్ శబరి, పలువురు సభ్యులతో కూడిన బృందం ఈ పర్యటనలో పాల్గొంది. ద్వైపాక్షిక సంబంధాలను బలోపేతం చేయడానికి, విద్యా సహకారానికి అవకాశాలను మరింత పెంపొందించడానికి ఈ పర్యటన జరిగింది. మొదట హెచ్‌సీయూ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ బీజేరావు, రిజిస్ట్రార్ డాక్టర్ దేవేష్‌నిగమ్, అంతర్జాతీయ వ్యవహారాల కార్యాలయం డైరెక్టర్ ప్రొఫెసర్ అరవింద్ సుసర్ల సమావేశమై ద్వైపాక్షిక సహకారం, విద్యారంగంలో పరస్పర సహకారం, భాగస్వామ్యంపై చర్చించారు.

ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలి



జుంబా కార్యక్రమంలో పాల్గొన్న ఫ్యాకల్టీ, విద్యార్థులు



హరితకు సర్టిఫికెట్‌ను ఇస్తున్న ఈడీ డాక్టర్ తేజ్‌లోహిత్‌రెడ్డి

రాయదుర్గం: ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఫుట్‌వేర్ డిజైన్ అండ్ డెవలప్‌మెంట్ ఇనిస్టిట్యూట్ హైదరాబాద్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ ఎన్ తేజ్‌లోహిత్‌రెడ్డి సూచించారు. జాతీయ ఫిట్‌నెస్ వారోత్సవాల్లో భాగంగా రాయదుర్గంలోని ఎఫ్‌డీడీఐ-హైదరాబాద్ క్యాంపస్‌లో టీమ్ సోషల్ అండ్ ఎన్విరాన్‌మెంట్ క్లబ్ పర్యవేక్షణలో బుధవారం ఉదయం జుంబా ఈవెంట్-ఫిట్‌నెస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. మణికొండకు చెందిన ప్రఖ్యాత ఫిజికల్ ఫిట్‌నెస్ ట్రైనర్ హరిత ఆధ్వర్యంలో ఎఫ్‌డీడీఐ విద్యార్థులు, ఫ్యాకల్టీ ప్రతినిధులకు ప్రత్యేక శిక్షణ ఇచ్చారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు ఆరోగ్యంగా ఉంటేనే చదువుకోవడానికి ఎలాంటి సమస్యలు తలెత్తవన్నారు. ఎఫ్‌డీడీఐ క్యాంపస్‌లో ఆరోగ్యం, వెల్‌నెస్‌ను ప్రోత్సహించడంలో కట్టుబడి ఉన్నామన్నారు. ఫిజికల్ ట్రైనర్ హరిత నాయకత్వంలో డైనమిక్, ఆకర్షణీయమైన శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించగా ఈ కార్యక్రమంలో పలువురు ఫ్యాకల్టీ, 40 మందికి పైగా విద్యార్థులు పాల్గొని జుంబా, నృత్యం, ఏరోబిక్ కదలికలను ఉత్సాహభరితమైన సంగీతంతో కలిపి నిర్వహించే డైనమిక్ ఫిట్‌నెస్ కార్యక్రమాన్ని నిర్వహించారు.

నిధులు మంజూరు చేయాలి



డిప్యూటీ కమిషనర్‌తో మాట్లాడుతున్న కార్పొరేటర్

రాయదుర్గం: గచ్చిబౌలి డివిజన్ అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని శేరిలింగంపల్లి సర్కిల్ డిప్యూటీ కమిషనర్ ప్రశాంతిని కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి కోరారు. బుధవారం ఆయన జీహెచ్ఎంసీ శేరిలింగంపల్లి సర్కిల్ కార్యాలయంలో ఆమెతో సమావేశమై పలు అంశాలపై చర్చించారు. డివిజన్ పరిధిలో పెండింగ్ పనులు త్వరగా పూర్తయ్యేలా చూడాలని కోరారు. డివిజన్ పరిధిలోని చెరువుల సుందరీకరణ, పార్కుల అభివృద్ధి, రోడ్ల మరమ్మతులు, తదితర వాటిపై అధికారులతో చర్చించి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు గంగాధర్‌రెడ్డి పేర్కొన్నారు.

తాగునీటి కోసం ఆందోళన

శంషాబాద్: సకాలంలో బిల్లులు చెల్లిస్తున్నా తమ కాలనీలో నీటి సరఫరా తీరు అస్తవ్యస్తంగా మారిందని మున్సిపాలిటీలోని వెశంకినీ కాలనీవాసులు బుధవారం ఆందోళన చేపట్టారు. స్ట్రీట్ నంబర్-1 వద్ద ఉన్న నీటి ట్యాంకు వద్దకు చేరుకుని మెట్రో వాటర్ బోర్డు పనితీరుపై నిరసన వ్యక్తం చేశారు. రోజు విడిచి రోజు నీటిని సరఫరా చేయాల్సిన వాటర్‌బోర్డు వారానికి ఒక్కరోజు మాత్రమే నీటి సరఫరా చేపడుతున్నారని ఆగ్రహించారు. వచ్చిన రోజు కూడా కేవలం 20 నిమిషాలు కూడా రాకపోవడంతో నీటిని నింపుకోలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. అధికారులు తక్షణమే చర్యలు తీసుకోకపోతే వాటర్‌బోర్డు కార్యాలయం వద్ద ఆందోళన నిర్వహిస్తామని హెచ్చరించారు..

లింకు బంద్‌తో ఇబ్బందులు..

అహ్మద్‌నగర్ సాత్ బస్తీలో ఒకేసారి 40 నల్లా కనెక్షన్లు క్రమబద్ధీకరించుకోకుండా నడిపిస్తున్నారని వాటర్‌బోర్డు ఇటీవల నీటి సరఫరా లింకును బంద్ చేసింది. ఇక్కడి బోరు కూడా పూర్తిగా పాడైపోవడంతో బస్తీ ప్రజలు నీటి కటకటతో కొట్టుమిట్టాడుతున్నారు. వీరికి బుధవారం మాజీ కౌన్సిలర్ జహంగీర్‌ఖాన్ సొంతంగా ట్యాంకర్లను తెప్పించి నీటి సరఫరా చేశారు.

అధిక లోడ్‌తో వాహనాలు నడిపిస్తే కేసులు



మాట్లాడుతున్న డీఎస్పీ రవీందర్‌రెడ్డి

పటాన్‌చెరు డీఎస్పీ రవీందర్‌రెడ్డి

పటాన్‌చెరు: అధిక లోడ్‌తో వాహనాలు నడిపిస్తే కేసులు నమోదు చేస్తామని పటాన్‌చెరు డీఎస్పీ రవీందర్‌రెడ్డి హెచ్చరించారు. బుధవారం మండలంలోని లక్డారంలో పోలీసు, రవాణ శాఖ ఆధ్వర్యంలో క్రషర్లలో నడిపే టిప్పర్ల వాహన డ్రైవర్లతో రహదారి భద్రత అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ.. అధిక లోడ్ వాహనాలు కనిపిస్తే కేసులు నమోదు చేస్తామన్నారు. డ్రైవర్లు సెల్‌ఫోన్ మాట్లాడుతూ, మద్యం సేవించి వాహనాలు నడపకూడదన్నారు. రోడ్డు ప్రమాదం జరిగితే డ్రైవర్ల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారన్నారు. రోడ్డు భద్రత నియమాలు తప్పకుండా పాటించాలన్నారు. అనంతరం ఎంవీఐ విజయరావు మాట్లాడుతూ.. వాహన డ్రైవర్లు తప్పకుండా తమ వెంట వాహనానికి సంబంధించిన వాహనపత్రాలు జిరాక్స్ కాపీ వెంట ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో పటాన్‌చెరు సీఐ వినాయక్ రెడ్డి, ఎస్ఐ వెంకట్ రెడ్డి, మహేశ్, డ్రైవర్లు, వాహన యజమానులు తదితరులు పాల్గొన్నారు.

భారత్ ఆర్మీకు ధన్యవాదాలు



ఎమ్మెల్యే గాంధీ

గచ్చిబౌలి: ఉగ్ర దాడిలో భర్తను కోల్పోయిన ప్రతీ మహిళ ప్రతీకారానికి చిహ్నమే ఈ 'ఆపరేషన్ సిందూర్' అని ఎమ్మెల్యే ఆరెకపూడిగాంధీ పేర్కొన్నారు. ఆపరేషన్ సిందూర్ విజయవంతమైన నేపథ్యంలో ఆయన మాట్లాడుతూ.. ఉగ్రవాదుల పహల్గామ్ దాడికి కౌంటర్‌గా ఇండియన్ ఆర్మీ చేపట్టిన ఆపరేషన్ సిందూర్ విజయవంతం చేయడంలో భారత సైన్యం చేసిన సాహసానికి ధన్యవాదాలు అన్నారు. పాకిస్తాన్, పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని ఉగ్రవాద కేంద్రాలపై భారత సైన్యం చేసిన దాడులు దేశ ప్రజలందరినీ గర్వపడేలా చేశాయన్నారు. తాజా పరిణామాల నేపథ్యంలో ప్రజలెవరూ భయభ్రాంతులకు గురి కాకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు.

కార్పొరేట్‌లకు అనుకూలంగా మోదీ సర్కార్

సీఐటీయూ రాష్ట్రఅధ్యక్షుడు చుక్కారాములు

పటాన్‌చెరు టౌన్: కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా వ్యవహరిస్తోన్న కేంద్రప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పక తప్పదని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు చుక్కా రాములు స్పష్టం చేశారు. ఈ నెల 20న జరిగే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని కార్మిక వర్గానికి పిలుపునిచ్చారు. బుధవారం పటాన్‌చెరు గ్రామిక్ భవన్‌లో జరిగిన సీఐటీయూ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. వెంటనే నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

రైతులకు స్థలం కేటాయించండి

జిన్నారం(పటాన్‌చెరు): పండించిన పంటను ఆరబోసేందుకు కల్లం, భద్రపరేచేందుకు గోదాం లేక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని రైతు సంఘం ఆధ్వర్యంలో బుధవారం తహసీల్దార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. గుమ్మడిదల మున్సిపాలిటీలో పరిధిలోని సర్వే నంబర్ 109లోని ప్రభుత్వ స్థలంలో పంటను ఆరబోసేందుకు కల్లాల ఏర్పాటుకు 10 ఎకరాలు, కోల్డ్ స్టోరేజీకి 5 ఎకరాల స్థలం కేటాయించాలని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డిని సైతం కలిసి విన్నవించారు. సహకార సంఘం డైరెక్టర్ బాల్‌రెడ్డి, స్థానిక రైతులు తదితరులు పాల్గొన్నారు.

చిత్రం.. సందేశాత్మకం



మాదాపూర్: కళాకారుడు వేసిన చిత్రాలు సందేశాత్మకంగా ఉన్నాయని జేఎన్ఎఫ్ఏయూ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ నిర్మల బిలుకా తెలిపారు. మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్ ఆర్ట్‌గ్యాలరీలో బుధవారం ఢిల్లీకి చెందిన కళాకారుడు సుర్జిత్ ఆక్రె వేసిన చిత్రాలను హ్యూస్ ఆఫ్ మై సోల్ పేరిట ప్రదర్శించారు. ఈ ప్రదర్శనలో 49 చిత్రాలను అందుబాటులో ఉంచారు. ఈ నెల 11వ తేదీ వరకు ప్రదర్శన కొనసాగుతుందని నిర్వాహకులు తెలిపారు.





చిత్రాలను తిలకిస్తున్న నిర్మలా బిలుకా

టెక్నాలజీపై అవగాహన అవసరం



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న చంద్రమోహన్‌రెడ్డి, రామేశ్వరరావు

రాయదుర్గం: ఆధునిక ప్రపంచంలో ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మెషిన్ లెర్నింగ్ ప్రాధాన్యం బాగా పెరిగిందని ఇంజినీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా డైరెక్టర్ డాక్టర్ జి రామేశ్వరరావు పేర్కొన్నారు. గచ్చిబౌలిలోని 'ఎస్కీ' క్యాంపస్‌లోని కన్వెన్షన్ సెంటర్ సెమినార్ హాల్లో నిరుద్యోగ యువత కోసం ప్రధాన మంత్రి కౌశల్ వికాస్ యోజన 4.0 కార్యక్రమాన్ని ఆయన బుధవారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పాఠశాలల స్థాయి నుంచే ఆధునిక టెక్నాలజీపై అవగాహన కల్పించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. రోజురోజు కూ మారిపోతున్న ఆధునిక సాంకేతికతను యువత అందిపుచ్చుకున్న రోజే భారత్ ప్రపంచ పటంలో ముందు ఉంటుందన్నారు. హెల్త్‌కేర్, రవాణా, మ్యానుఫ్యాక్చరింగ్, రిటైల్స్, గేమింగ్, ఈ కామర్స్, సైబర్ సెక్యూరిటీ, ఫైనాన్స్ రంగాల్లో ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ బాగా పనిచేస్తుందన్నారు. 'ఎస్కీ'తో ఒప్పందం చేసుకున్న నగరంలోని ఇంజినీరింగ్ కళాశాలలో ఇప్పటి కే ఏఐ అండ్ ఎంఎల్ మీద శిక్షణ పూర్తి చేశామన్నారు.

శంకుస్థాపన

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని బండ్లగూడ ముదిరాజ్ శ్మశాన వాటికలో స్నానపు గదుల నిర్మాణానికి బుధవారం కార్పొరేటర్ మెట్టు కుమార్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సొంత నిధులతో స్నానపు గదులు ఏర్పాటు చేయిస్తున్నానని తెలిపారు. కార్యక్రమంలో బండ్లగూడ బీఆర్ఎస్ అధ్యక్షుడు భరత్ కుమార్, డివిజన్ అధ్యక్షుడు నాగరాజు యాదవ్, స్థానికులు సత్తయ్య, అర్జున్, జగదీష్, శ్రీరాములు, ముదిరాజ్ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): బీహెచ్ఈఎల్ టౌన్‌షిప్‌లోని విశ్వకర్మ ఆలయంలో బుధవారం శ్రీ విరాట్ పోతులూరి వీర బ్రహ్మేంద్రస్వామి 332 ఆరాధన మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

ఐటీ కారిడార్‌లో మోగిన సైరన్



నల్లగండ్ల అపర్ణ నియో మాల్ వద్ద సైరన్ మోగించిన చందానగర్ పోలీసులు

గచ్చిబౌలి: సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలోని ఐటీ కారిడార్‌లో మాక్ ఎక్సైజ్‌లో భాగంగా పోలీసులు సైరన్ మోగించారు. దేశ వ్యాప్తంగా ఒక వైపు మాక్ డ్రిల్ జరుగుతుండగా మరో వైపు పోలీసులు మాక్ క్సైజ్‌ను నిర్వహించి వైమానికి దాడుల జరిగితే అప్రమత్తంగా ఉండాలని అవగాహన కల్పించారు. బుధవారం సాయంత్రం 4 గంటలకు గచ్చిబౌలి పీఎస్ పరిధిలోని ట్రిపుల్ జంక్షన్, విప్రో జంక్షన్, కొత్తగూడ జంక్షన్, రాయదుర్గం పీఎస్ పరిధిలోని టీహబ్, గచ్చిబౌలి జంక్షన్, రాయదుర్గం, ఖాజాగూడ, మణికొండ మర్రి చెట్టు జంక్షన్‌లు, మాదాపూర్ పీఎస్ పరిధిలోని సైబర్‌టవర్స్, మైండ్‌స్పేస్, ఇనార్బిట్ మాల్, అయ్యప్పసొసైటీ, చందానగర్‌పీఎస్ పరిధిలో నల్లగండ్ల అపర్ణ నియో మాల్, పీజేఆర్ స్టేడియం, తారానగర్ మార్కెట్, మియాపూర్ పీఎస్ పరిధిలో ఆల్విన్ క్రాస్ రోడ్డు, ప్రేమ్‌నగర్‌లో పోలీసులు రెండు నిమిషాల పాటు సైరన్ మోగించారు. ట్రిపుల్ ఐటీ జంక్షన్‌లో శేరిలింగంపల్లి తహసీల్దార్ వెంకారెడ్డి, మాదాపూర్ ఏసీపీ సీ.హెచ్.శ్రీకాంత్ మాక్ ఎక్సైజ్‌లో పాల్గొన్నారు.



ట్రిపుల్ ఐటీ జంక్షన్‌లో మాక్ ఎక్సైజ్‌లో పాల్గొన్న తహసీల్దార్ వెంకారెడ్డి, మాదాపూర్ ఏసీపీ శ్రీకాంత్





సైబర్ టవర్ జంక్షన్‌లో..